నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు...

చందానగర్‌ : చందానగర్‌ సెక్షన్‌ పరిధిలోని హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్తాండనగర్‌, ఆదిత్యా ఇంపీరియల్‌ హైట్స్‌ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 05.00 వరకు మార్తాండనగర్‌, న్యూ హఫీజ్‌పేట్‌, హనీఫ్‌ కాలనీ, ఆదిత్యా ఇంపీరియల్‌ హైట్స్‌, వినాయకనగర్‌, ప్రకాష్‌నగర్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

హఫీజ్‌పేట్‌ సెక్షన్‌ పరిధిలో...

- హఫీజ్‌పేట్‌, ఆదిత్యనగర్‌ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 05.00 వరకు ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌, సాయినగర్‌, యూత్‌ కాలనీ, వార్డు ఆఫీస్‌, గ్రీన్‌ బవార్చి, ఆదిత్యనగర్‌, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్‌ ఫంక్షన్‌ హాల్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.
- మాతృశ్రీ, శ్రీలీలా, విశ్వంభర ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.30 వరకు మాతృశ్రీనగర్‌ కొంత భాగం, విశ్వంభర, శ్రీలీలా విల్లాస్‌, వాటర్‌ వర్క్స్‌, కల్వరి టెంపుల్‌, శిల్పా ఎవెన్యూ, ఎస్‌ఎంఆర్‌ అపార్ట్‌మెంట్స్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- కల్యాణ్‌ గార్డెన్స్‌, మాధవనగర్‌, దుర్గామాత ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 04.30 వరకు మాతృశ్రీనగర్‌ కొంత భాగం, మాధవనగర్‌, అంబేద్కర్‌నగర్‌, నందిన గర్‌, బొమ్మరిల్లు, సాయి రంగా థియేటర్‌, రాజరాం కాలనీ ఏరియాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- సోమవారం ఉందయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్‌ కాలనీ , మాధవిహిల్స్‌, గోల్డెన్‌ తులీప్‌ రోడ్‌ నెంబర్‌ 1.2.3.4.5, రాఘవేంద్ర కాలనీ హైటెన్షన్‌ రోడ్‌, వెంకటరమణ టాటా మోటార్స్‌ లేన్‌, ప్రశాంత్‌నగర్‌, కొండాపూర్‌, జూబ్లీ గార్డెన్‌, భిక్షపతినగర్‌, రాఘవేంద్ర కాలనీ ఏ.బీ.సీ బ్లాక్‌లు, రాజరాజేశ్వరీ కాలనీ, హనుమాన్‌నగర్‌, సైబర్‌ వ్యాలీ, గోపాల్‌రెడ్డి కాలనీ, అపర్ణ, హఫీజ్‌పేట్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వైట్‌ ఫీల్డ్‌ పరిధిలో ....

మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని వైట్‌ఫీల్డ్‌ ఏఈ కిశోర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీరాంనగర్‌ కాలనీ ఏ.బీ.సీ బ్లాక్‌లలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. దీనిని గుర్తుంచుకుని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బీఎస్‌ఎఫ్‌ హెచ్‌సీయూ నూతన అధ్యక్షుడిగా అంజి ఎర్రోళ్ల

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ బహుజన స్టూడెంట్స్‌ ఫ్రంట్‌(బీఎస్‌ఎఫ్‌) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కన్వీనర్‌గా గుంటి రోహిత్‌, అధ్యక్షుడిగా అంజి ఎర్రోళ్ల, ఉపాధ్యక్షులుగా రచన, దివాకర్‌, ఆశ్చర్యలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా సంధ్య పోగు ప్రసన్న, ముద్దమ్‌ నవీన్‌ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంజి ఎర్రోళ్ల మాట్లాడుతూ బహుజన మహనీయుల ఆశయ సాధనే లక్ష్యంగా బీఎస్‌ఎఫ్‌ పనిచేస్తుందన్నారు. పూలే, అంబేద్కర్‌, కాన్షీరామ్‌ల ఆలోచనలు, పోరాటాలు, త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ బహుజన విద్యార్థులను సంఘటితం చేయడంతో బీఎస్‌ఎఫ్‌ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి



జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌ కాలనీలో బసవలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన, లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన ఆలయాలు నిర్మాణంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువా తో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ హనుమంత్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, బీరప్పయాదవ్‌, సతీష్‌శ్రీకాంత్‌ యాదవ్‌, శైలజ, పుండరీకం, నాయకులు రత్నం, విజయారెడ్డి, జనార్దన్‌, సాయి, శారద స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం...

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవి కుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సర్కిల్‌ కార్యాలయంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్కిల్‌ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ అవకాశాన్ని సర్కిల్‌ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొండాపూర్‌ థాణా ఏర్పాటుకు కసరత్తు

రెండుగా విడిపోనున్న గచ్చిబౌలి పీఎస్‌

- రాష్ట్రంలోనే అత్యధిక కేసులు నమోదు
- నూతన పీఎస్‌ ఏర్పాటుపై అధికారుల చర్చలు

ఐటీ కారిడార్‌లో ముఖ్యమైన ఠాణాల్లో గచ్చిబౌలి ఒకటి. ఒక వైపు ఐటీ కంపెనీలు, కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీలు, హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ, ఫైవ్‌స్టార్‌ హోటళ్లు, శరత్‌సిటీ క్యాపిటల్‌ మాల్‌, సినిమా హాళ్లు ఈ పీఎస్‌ పరిధిలో ఉన్నాయి. ఈ పీఎస్‌ పరిధిలో 2024లో రాష్ట్రంలోనే అత్యధికంగా 2058 కేసులు నమోదు కావడం గమనార్హం. కొండాపూర్‌ కొత్త పీఎస్‌ ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఇటీవల కేసుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ విభజన మరో సారి తెరపైకి వచ్చింది. సైబరాబాద్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి ఆదేశాలతో కొద్ది రోజులుగా పోలీస్‌ అధికారులు కొండాపూర్‌ ఠాణా ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇందులో చేర్చాల్సిన ప్రాంతాలు, కాలనీలపై సమీక్షిస్తున్నారు. –గచ్చిబౌలి



ట్రిపుల్‌ ఐటీ జంక్షన్‌లోని గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌

కొండాపూర్‌ పీఎస్‌ పరిధిలోని ప్రాంతాలు ఇవీ..?

కొండాపూర్‌ పీఎస్‌ ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలుస్తోంది. గచ్చిబౌలి పీఎస్‌లో భాగమైన కొత్తగూడ, శ్రీరాం నగర్‌ ఏ బ్లాక్‌, గౌతమీ ఎన్‌క్లేవ్‌, మసీద్‌బండ పార్ట్‌, సుదర్శన్‌ నగర్‌, మారుతీనగర్‌, హెచ్‌ఏఎల్‌ కాలనీ, జేవీజీహిల్స్‌, సెంట్రల్‌పార్క్‌, శిల్పా వ్యాలీ, కాంతి వనం, రాజరాజేశ్వరీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, గోపాల్‌రెడ్డి నగర్‌, అనందర్‌నగర్‌ కాలనీ, కొండాపూర్‌ బెటాలియన్‌, మియాపూర్‌ పీఎస్‌ పరిధిలోని శిల్పా గార్డెన్‌ ఉడ్‌ల్యాండ్‌ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ప్రేమ్‌నగర్‌, మార్తండనగర్‌, మాదాపూర్‌ పీఎస్‌ పరిధిలోని ఆదిత్యనగర్‌, సీఆర్‌ ఫౌండేషన్‌, భిక్షపతినగర్‌ తదితర ప్రాంతాలు ఈ పీఎస్‌ పరిధిలోకి రానున్నట్లు సమాచారం. బొటానికల్‌ గార్డెన్‌ నుంచి మసీద్‌బండ, జీహెచ్‌ఎంసీ శేరలింగంపల్లి జోనల్‌కార్యాలయం ఎదురుగా ఉన్న లింక్‌ రోడ్డు నుంచి రైల్వే ట్రాక్‌ వరకు, హఫీజ్‌పేట్‌ ఫ్లై ఓవర్‌ నుంచి బొటానికల్‌ గార్డెన్‌ వరకు పీఎస్‌ నమూనా రెడీ చేసినట్లు సమాచారం. కొండాపూర్‌ మధ్యలో ఏదైనా ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేస్తే బాగుంటుందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. కొత్త ఠాణా ప్రణాళికను ప్రభుత్వానికి పంపనున్నారు.

పదేళ్లుగా ఒకటే పీఎస్‌..

కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీలు పెరగడం, ప్రజల సంఖ్యతో పాటు నేరాల సంఖ్య పెరగడంతో కొత్త పోలీస్‌ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇండిపెండెంట్‌ ఇళ్ల సంఖ్య తగ్గుముఖం పట్టి కాలనీల్లో అపార్ట్‌మెంట్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గేటెడ్‌ కమ్యూనిటీల్లో వేల సంఖ్యలో నివాసం ఉంటున్నారు. జనాభా వేగంగా పెరుగుతుండటంతో శాంతి భద్రతల విషయంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విజిబుల్‌ పోలీసింగ్‌ కోసం కొత్త పీఎస్‌ ఏర్పాటు తప్పని సరి అయ్యింది. ఈ క్రమంలోనే 2014 జూలైలో గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రాయదుర్గం, మాదాపూర్‌ పీఎస్‌ల పరిధిలోని ప్రాంతాలను కలుపుతూ గచ్చిబౌలి పీఎస్‌ ఏర్పడింది. సరిగ్గా పదిన్నర సంవత్సరాల్లో ఆ పీఎస్‌లో రాష్ట్రంలోనే అత్యధిక కేసులు నమోదు కావడం గమనార్హం. 2023లో 1474 కేసులు నమోదు కాగా 2025లో వాటి సంఖ్య 2058 చేరుకుంది.


ఠాణాల పునర్విభజన నిరంతర ప్రక్రియ

మహా నగరాల్లో ఠాణాల పునర్విభజన నిరంతర ప్రక్రియ. శర వేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్‌ కమిషనరేట్‌లో కొత్త పోలీస్‌ స్టేషన్ల ఏర్పాటు తప్పనిసరి కానుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలంలో రాయదుర్గం, చందానగర్‌ పీఎస్‌లు మాత్రమే ఉండేవి. సైబరాబాద్‌ కమిషనరేట్‌ ఏర్పాటుకు ముందు అవుట్‌ పోస్ట్‌గా ఉన్న మాదాపూర్‌ పీఎస్‌గా అవతరించింది. రాయదుర్గం పీఎస్‌ శంకర్‌పల్లి మండలం పరిధిలో జన్వాడ వరకు విస్తరించి ఉండేది. గచ్చిబౌలి విలేజ్‌ వరకు చందానగర్‌ పీఎస్‌ పరిధి ఉండేది. శివారు ప్రాంతాల్లో తరచూ దోపిడీ జరుగుతండటంతో 2008లో అప్పటి కమిషనర్‌ మహేందర్‌ రెడ్డి పీఎస్‌ల పరిధిని మార్చారు. జన్వాడ నార్సింగి పీఎస్‌కు వెళ్లగా, గచ్చిబౌలి ప్రాంతాన్ని రాయదుర్గం పీఎస్‌లో కలిపారు. కాలనీల సంఖ్య పెరగడంతో 2014లో గచ్చిబౌలి, జగద్గిరిగుట్ట పీఎస్‌లను ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం కొల్లూరు పీఎస్‌ను ఏర్పాటు చేశారు. గోపన్‌పల్లి, తెల్లాపూర్‌, కోకపేట్‌లో పెద్ద ఎత్తున గేటెడ్‌ కమ్యూనిటీలు వస్తున్నాయి. కమర్షియల్‌ కాంప్లెక్స్‌లు, మాల్స్‌, హోటల్స్‌, హస్పిటల్స్‌ వచ్చే అవకాశం ఉంది.

కేసుల సంఖ్య ఇలా..

క్ర.సం.	2023	2025
1.ఆర్డినరీ థెఫ్ట్‌	189	262
2.చీటింగ్‌	405	506
3.మర్డర్‌	02	04
4.హౌస్‌ థెఫ్ట్‌	12	12
5.సింపుల్‌ హర్ట్‌	65	93
6. 194 బీఎన్‌ఎన్‌ఎస్‌(174)	87	114
7.మిస్సింగ్‌	141	169
8. ఫాటల్‌ రోడ్‌ యాక్సిడెంట్‌	40	43
9. నాన్‌ ఫాటల్‌	127	160

ప్రజల సంఖ్యతో పాటు నేరాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న పీఎస్‌లను పునర్విభజన చేసి కోకాపేట్‌, గోపన్‌పల్లి ప్రాంతాల్లో కొన్నేళ్లలోనే కొత్త ఠాణాల ఏర్పాటయ్యే అవకాశం లేకపోలేదు.



అలరించిన నృత్య ప్రదర్శన



చందానగర్‌ : రంగ భూమి స్పేస్‌ అండ్‌ ఈవెంట్స్‌ వేదికలో వివేకా చూడామణి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మ్యూజిక్‌ అండ్‌ డాన్స్‌ ఆధ్వర్యంలో నృత్య సేవ కూచిపూడి, భారతనాట్య కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉభయ నాట్య రత్న, డాక్టర్‌ జాకీర్‌ హుస్సేన్‌ అవార్డ్‌ గ్రహీత, ప్రభుత్వ మ్యూజిక్‌ అండ్‌ డాన్స్‌ కాలేజీ రిటైర్డ్‌ ప్రిన్సిపాల్‌ నెమలికంటి స్వర్ణలత, వేదాంతం రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 35 మూవీ నీలి మేఘాలలో ఫేమ్‌ సంగీత దర్శకులు వివేక్‌ సాగర్‌, గేయ రచయిత గాలి భరద్వాజ హాజరయ్యారు. వివేకా చూడామణి విద్యార్థులు శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేయగా, భరతనాట్యంలో మూసికవాహన, నాతా పుష్పాంజలి, గంభీరనాథ పుష్పాంజలి, హరివరాసనం, శ్లోకాలు , ఆనంద నర్తన గణపతి, మల్లారి, భో శంభో, కూచిపూడి నృత్యంలో జయ జనార్ధన, అలూరు కురియాగ, రారా రా వేణు, తరంగం కృష్ణం కళాసఖి సుందరం, జాతీశ్వరం, ఐగిరి నందిని ప్రథమార్ధం భరతనాట్యంలో రెండవ భాగంలో కూచిపూడిలో నిర్వహించారు.



ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్‌: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెంగళూరుకి చెందిన సుముఖ శ్రీ కళా కుటీర గురువు అశ్విని సుకీర్తి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. తం తం తం మూషికవాహన, రరావేణు, సరసిజాక్షులు, దరువర్ణం, శ్రీరాజరాజేశ్వరీ, జావళి, చంద్రచూడా, నవరస రామాయణ తదితర అంశాలను కళాకారులు పూజిత, రక్షిత, మోనికా, సుదీప్తి, వర్ష, కీర్తన, వైభవి తదితరులు నృత్యరూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

కార్మికుల సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యం

పటాన్‌చెరు టౌన్‌: కార్మికుల కష్ట సుఖాలు సీఐటీయూకే తెలుసని సీఐటీయూ రాష్ట అధ్యక్షుడు, యూనియన్‌ అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్‌ కార్మిక సంఘాల నుంచి పలువురు కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా చుక్కారాములు మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన నిలబడుతూ వారి యోగ క్షేమాల్లో సీఐటీయూ పాలు పంచుకుంటుందన్నారు. సీఐటీయూ ఉన్నచోట మాత్రమే కార్మికులకు న్యాయం జరుగుతుందని కార్మికుల్లో ప్రగాఢ నమ్మకం ఉందన్నారు. జిల్లాల్లో పలు పరిశ్రమల్లో చారిత్రాత్మక వేతన ఒప్పందాలు చేసిన చరిత్ర సీఐటీయూకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజయ్య, వజిద్‌అలీ, యూనియన్‌, జనరల్‌ సెక్రటరీ వీఎస్‌ రాజు, యూనియన్‌ నాయకులు తలారి శ్రీనివాస్‌, నాగప్రసాద్‌, బిలాల్‌, మహేశ్వర్‌రెడ్డి, సోమన్న పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరిన నాయకులు

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు



పటాన్‌చెరు టౌన్‌: డివిజన్‌ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానం, జె.పి కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్‌ కాలనీలోని మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహా శివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే, శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో శివస్వాములకు ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

మార్చి 9న ఆల్‌ కాలనీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఎన్నికలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌ కాలనీస్‌ రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఫెడరేషన్‌ ఎన్నికలను మార్చి 9న నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. పోటీ చేయాలనుకునే వారు ఎన్నికల అధికారులకు తమ నామినేషన్లను సమర్పించాలని తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఓ సారి ఎన్నికలు జరుగుతాయని, అందులో భాగంగా అధ్యక్షుడు, 5 మంది ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు 5 మంది, కార్యనిర్వాహక కార్యదర్శులు 7 మంది, కోశాధికారి, ఉప కోశాధికారులకు ఎన్నికలు ఉంటాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లోని సమస్యలపై అవగాహన ఉండి వాటి పరిష్కారానికి కృషి చేయగలిగి, రాజకీయ పార్టీలకు సంబంధం లేని వారు ముందుకు రావాలన్నారు. సాయిరాం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 4,5 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు

మియాపూర్‌: ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న తమ కుమారుడిని వాతలు వచ్చేలా కొట్టిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అతడి తండ్రి శనివారం రాత్రి మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విద్యార్థి తండ్రి శివ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్‌ మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలలో దేవి ప్రసాద్‌ 3వ తరగతి చదువుతున్నాడు. శనివారం స్కూల్‌లో అతను లెక్కలు తప్పు చేసినందుకు మ్యాథ్స్‌ టీచర్‌ గోవర్ధన్‌ ఒక్కో తప్పుకు పది దెబ్బలు కొట్టాడు. విద్యార్థి ముక్కుపై కొట్టడంతో ముక్కులో నుండి రక్తం వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నాడు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రయ్య తెలిపారు.

చర్చి నిర్మాణానికి విరాళం

పటాన్‌చెరు: డివిజన్‌ పరిధి శాంతినగర్‌లోని మెథడిస్ట్‌ చర్చ్‌ నిర్మాణానికి ఎండీఆర్‌ ఫౌండేషన్‌ రూ. లక్ష విరాళం అందజేశారు. ఎండీఆర్‌ ఫౌండర్‌, కోఫౌండర్‌ పృథ్వీరాజ్‌ మాట్లాడుతూ.. ఫౌండేషన్‌ ద్వారా విద్యా, వైద్యం, ఆధ్యాత్మిక ప్రదేశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్‌ రంజిత్‌, సెక్రటరీ సోలమన్‌, భాస్కర్‌, విల్సన్‌, జేమ్స్‌, విక్రాంత్‌ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న పృథ్వీరాజ్‌

26న శివసాయిక్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు

రాయదుర్గం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఈనెల 26న శివరాత్రి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి 11.45 గంటల వరకు ప్రత్యేకంగా ఆలయంలోని దేవతా మూర్తులకు అభిషేకం చేస్తారు. 8 గంటలకు మహాశివలింగ అభిషేకం, 9 గంటలకు అష్టోత్తర శత కలశస్థాపన, 12 గంటలకు ప్రత్యేక అలంకారం, నైవేద్య సమర్పణ, మంత్రపుష్పం, మధ్యాహ్నం 1.30 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు దర్శనం, అర్చన కార్యక్రమం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదోశ కాల అభిషేకం , రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు శివ కల్యాణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు స్థాపిత కలశ జలాలతో అభిషేకం, 12.30 గంటలకు అన్నాభిషేకం, రాత్రి 1 గంటకు ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌ ఆలయంలో..

రాయదుర్గం: గచ్చిబౌలి జీపీఆర్‌ఏక్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు జరుగుతాయి. భక్తులు తమ స్వహస్తాలతో స్వయంగా చంద్రమౌళీశ్వరస్వామి వారికి అభిషేకం చేసే అవకాశం కల్పించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు.

25 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు రోజుల పాటు 25, 26,27వ తేదీల్లో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్‌ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

25న భాగ్యలక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నానక్‌రాంగూడలో 2000 సంవత్సరంలో చిన్న ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. అప్పటి నుంచి ఏటా ఫిబ్రవరి 25న వార్షికోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ధర్మకర్త తుకారామ్‌ ఆధ్వర్యంలో, పూజారి జోగేంద్రశర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మెదక్‌జిల్లా రుస్తుంపేటలోని శ్రీమదానంద సరస్వతిస్వామి ఆశ్రమానికి చెందిన రాజయోగి వెంకటస్వామి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పూలు, విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

పూజా కార్యక్రమాలు ఇవీ..

భాగ్యలక్ష్మీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 7.30 గంటలకు ఆలయంలో గణపతిపూజ, పుణ్యావాచనంతో వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తారు. అనంతరం పంచగవ్య (ఆరాధన)ప్రసన్న కార్యక్రమం, వాస్తు పూజ, వాస్తుహోమం, విశేష ఆరాధన, బాలభోగం, అష్టకలశాభిషేకం లక్ష్మీ మహాయజ్ఞం, మూల మంత్రంతో ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమం, సహస్రనామార్చన, అమ్మవారి ఒడి నింపుట కార్యక్రమం నిర్వహిస్తారు.అనంతరం మహానైవేద్యం, హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్‌ వెంకట చలపతి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాంఘిక సంక్షేమ గురుకులాల 'కామన్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌–2025' ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల, బాలుర కళాశాల(టీజీఎస్‌ఆర్‌జేసీ–బి–సీట్‌,ప్రెప్‌ అకాడమీ)లో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష కొనసాగింది. అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో గురుకుల్లో 5వ తరగతిలో అడ్మిషన్లు, 6,7,8,9 తరగతుల్లో ఉన్న ఖాళీల భర్తీ కోసం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. గౌలిదొడ్డిలో గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్‌ కల్పన ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కేంద్రంలో 212 మంది విద్యార్థులకు గాను 181 మంది పరీక్షకు హాజరయ్యారు. గౌలిదొడ్డిలో ప్రిన్సిపాల్‌ కె వెంకటచలపతి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కేంద్రంలో 83 మందికి గాను 62 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.



పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు